
జైలు అధికారులతో ట్రైనీ ఐపీఎస్‌లు

చంచల్‌గూడ జైలును సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

సైదాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్టడీ టూర్‌లో భాగంగా సర్దార్ వల్లభాయ్ నేషనల్ పోలీస్ అకాడమీకి చెందిన 50 మంది ట్రైనీ ఐపీఎస్‌లు గురువారం చంచల్‌గూడ జైలును సందర్శించారు. ఖైదీల బ్యారక్‌లు, ఫ్యాక్టరీ, జైలు ఆస్పత్రి, భోజనశాలను ట్రైనీ ఐపీఎస్‌లు పరిశీలించారు. జైలులో భద్రత, ఖైదీల సంక్షేమం, భోజన వసతులు, ఫోన్, ములాఖత్ సౌకర్యాలు, న్యాయ సహాయంపై జైలు అధికారులు వారికి వివరించారు.


యాంటీ ర్యాగింగ్ సదస్సులో పాల్గొన్న ఏసీపీ కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డిలకు పూల మొక్కలను అందిస్తున్న విద్యార్థినులు

విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను దరిచేరనీయొద్దు: ఏసీపీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ర్యాగింగ్ భూతాన్ని దరిచేరనీయకండని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి విద్యార్థులకు సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కళాశాలల్లో సీనియర్లు జూనియర్ విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలగాలని సూచించారు. ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఒక్కసారి కేసు నమోదు అయితే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తోందని విద్యార్థులకు తెలిపారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బద్యానాయక్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ శేషతల్ప సాయి, ఉమామహేశ్వరరావు, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, ఏఓ పిచ్చిరెడ్డి, పీఆర్‌ఓ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలి

హయత్‌నగర్ : వికలాంగుల హక్కుల పోరాట సమితి 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హయత్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి పతాకాన్ని ఎగుర వేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికలాంగుల హక్కుల పోరాట సమితి కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పట్ల చిన్న చూపు చూస్తుందన్నారు. ప్రభుత్వం వికలాంగులకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించి సీట్లు కేటాయించాలని కోరారు. అన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వికలాంగులకు రూ.6000 పెన్షన్ ఇస్తామని చెప్పి 20 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణు, మల్లేష్, కల్పన, రవి, లక్ష్మారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

రాచకాలువ పునరుద్ధరణ పనులు పూర్తిచేయాలి


రాచకాలువ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని రాచకాలువ పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ క్రిస్టల్ విల్లాస్ నుంచి మహాలక్ష్మీకాలనీ వరకు స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మించేందుకు గాను రాచకాలువ పునరుద్ధరణ పనులను సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో భాగంగా రాచకాలువ పునరుద్ధరణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శుక్లజ, సర్వేయర్ జ్యోతి, ఇరిగేషన్ ఏఈ సతీష్, హైడ్రా ఎస్‌ఐ ముజఫర్, ఎస్‌ఐ అనిల్ పాల్గొన్నారు.

పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

సైదాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ పూర్ణోదయ కాలనీ, వాణినగర్‌లలో పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరతూ యువజన కాంగ్రెస్ నేత కోట్ల లడ్డుపటేల్ గురువారం దక్షిణ మండలం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.


రూ.2.65లక్షల చెక్కును విరాళంగా అందజేస్తున్న విగ్రహ దాత పర్వతాల్‌రెడ్డి

బాలాపూర్ బడా గణేశ్ విగ్రహ దాత పర్వతాల్‌రెడ్డి

● రూ.2.65లక్షలు విరాళంగా అందజేత

సరూర్‌నగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న బాలాపూర్ బడా గణేశుడు బుధవారం స్వర్ణగిరి నామూనాతో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరి భక్తుల పూజలందుకుంటున్నాడు. కాగా వినాయకుడి 21 అడుగుల ఎత్తైన విగ్రహం ఖర్చును బాలాపూర్‌కు చెందిన రైతు, పీపీఆర్ ట్రస్ట్ చైర్మన్ పన్నాల పర్వతాల్‌రెడ్డి భరించారు. ఈ క్రమంలో గురువారం ఆయన బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులకు రూ.2.65లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా బాలాపూర్ వినాయకుడి విగ్రహం అందజేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో పర్వతాల్‌రెడ్డి కుమారులు వంశీరెడ్డి, కిరణ్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఉత్సవ సమితి ప్రతినిధులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

30 స్టూల్స్ వితరణ

చంపాపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు, వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు కూర్చునేందు కోసం ఆలయ మాజీ ధర్మకర్త నాగబండి రాములు కుమారుడు కర్మన్‌ఘాట్ పద్మానగర్‌కాలనీకి చెందిన నాగబండి నాగేష్‌గుప్తా, లక్ష్మీ దంపతులు గురువారం 30 ప్లాస్టిక్ స్టూల్స్‌ను ఆలయ సిబ్బందికి వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దుర్గారెడ్డి, ఆలయ సిబ్బంది రమాదేవి, అర్చకులు కందాళ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.


భారత్‌కు బంగారు, కాంస్య పతకాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరుగుతున్న 6వ ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ మెన్ విభాగంలో భారత్ బంగారు, కాంస్య పతకాలను దక్కించుకుంది. ఈ నెల 30 వరకు జరిగే ఈ పోటీల్లో భారత్ తరఫున పాల్గొన్న హైదరాబాద్ వాసి కొడవలి తనిష్క్ మురళీధర్‌నాయుడు 25 మీటర్ల రేంజ్‌లో బంగారు, కాంస్యం పతకాలు గెలుపొందాడు.


తనిష్క్ మురళీధర్


మన్సూరాబాద్ వీకర్‌సెక్షన్‌కాలనీలోని గణనాథుడిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి


ఎల్‌సీహెచ్‌కాలనీలో వినాయకుడి పూజల్లో సైదాబాద్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, కమిటీ సభ్యులు


హయత్‌నగర్ వినాయకనగర్‌కాలనీలో గణపతికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి


పెద్దఅంబర్‌పేట్ బ్యాంక్‌కాలనీలో కొలువుదీరిన 11 దేవతామూర్తుల తలలతో రూపొందించిన వినాయకుడు


వనస్థలిపురం రెడ్‌వాటర్ ట్యాంక్ వద్ద పోకలతో రూపుదిద్దుకున్న గణేశుడు


పెద్దఅంబర్‌పేట్ 5వ వార్డు బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో ప్రతిష్ఠించిన ద్వారదీష్ టెంపుల్ నమూనాతో రూపొందించిన గణనాథుడు

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి: వినాయకచవితి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బస్తీలు, కాలనీలు, అపార్టుమెంట్ల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు విభిన్న రకాల గణనాథులను ఏర్పాటు చేశారు. స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన బుధవారం రోజునే పర్వదినం రావడంతో భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో, మన్సూరాబాద్, నాగోల్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో పలు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నాయి. అందులో భాగంగా శ్రీరామ్ గణేశ్ యూత్ అధ్యక్షుడు ముద్దగౌని జగన్‌మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 26 అడుగుల విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, దత్తాత్రేయ సమేత లంబోధరుడు, రెడ్ ట్యాంక్ వద్ద పోకలతో రూపొందించిన గణనాథుడు, న్యూస్ పేపర్ గణనాథుడు, కమలానగర్‌లో పంచముఖ గణపతి, ఎన్జీవోస్‌కాలనీలో రామసేన యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన మల్లార్ గణనాథుడు, సెల్ఫ్ ఫైనాన్స్‌కాలనీలో శ్రీవినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన కార్తికేయ సమేత గణనాథుడు భక్తులను విశేషంగా ఆకర్శిస్తున్నాడు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటున్నారు. హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి వినాయకనగర్‌కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి మహాగణపతికి పూజలు నిర్వహించారు.


లక్ష్మీనగర్ వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో వినాయక చవితిని పురస్కరించుకొని మండపంలో వేద పండితులు, అర్చకులు హోమాన్ని నిర్వహించారు. అనంతరం వినాయకుడికి ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రాల్లో వినాయకులను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించగా మరికొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి వరకు గణనాథులను మండపాలకు చేర్చి పూజలు నిర్వహించారు. మలకపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో దాదాపు 150 వినాయక విగ్రహాలు, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 140కి పైగా గణనాథుని విగ్రహాలు కొలువుదీరాయి.


అభిమన్యు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన న్యూస్ పేపర్ గణనాథుడు


కుర్మబస్తీ లంబోదరుడిని దర్శించుకున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ


ఫణిగిరికాలనీలోని వెంకటసాయినగర్‌లో వినాయక మండపాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్‌యాదవ్, శ్రీనివాస్‌నాయుడు


వాసవీకాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణపతిని దర్శించుకుంటున్న అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి అంజయ్య, బచ్చు ప్రభాకర్


అల్కాపురిలో పూజల్లో పాల్గొన్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖ దంపతులు, సుమతి హరినాథ్‌రెడ్డి, అధ్యక్షుడు వంశీ


సరూర్‌నగర్‌లో పూజల్లో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్, పండరి, సంపత్, సుధాకర్‌రెడ్డి, నిఖిల్


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తలు, అర్చకులు, ఆలయ సిబ్బంది


శాలివాహననగర్‌కాలనీలో పూజలు నిర్వహిస్తున్న బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్‌రెడ్డి తదితరులు


మన్సూరాబాద్ కాస్మోపాలిటన్‌కాలనీ గణనాథుడిని దర్శించుకున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పోచబోయిన జగదీష్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనర్సింహ


శాలివాహననగర్‌లో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ సుబ్బిరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ నరేష్

ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి

● బాలాపూర్‌లో ఎమ్మెల్యే సబితారెడ్డి వ్యాఖ్య

సరూర్‌నగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ విఘ్నేశ్వరుడిని నవరాత్రుల తొలి రోజైన బుధవారం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తన కుమారులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆమెకు లడ్డూ ప్రసాదం అందజేసి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయకుడి కరుణతో ఈ సారి వానలు సమృద్ధిగా కురుస్తున్నాయని, అన్నదాతలు సాగు పనులు నిర్విఘ్నంగా చేసుకోవడానికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఏవిధంగా రైతులను ఆదుకోవాలో ఆ విధంగా ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలంటూ.. పరోక్షంగా యూరియా కొరత తీర్చాలనే విధంగా వ్యాఖ్యానించారు.


బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు


బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్న పారిజాతారెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

మాజీ మేయర్ పూజలు

బడంగ్‌పేట్ మాజీ మేయర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి బుధవారం బాలాపూర్ గణేశ్ మండపాన్ని సందర్శించి వినాయకుడిని దర్శించుకున్నారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ గ్రామ వినాయకుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడించడం తమ గ్రామానికే గర్వకారణమని వ్యాఖ్యానించారు.

బీసీల యుద్ధభేరి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం

బర్కత్‌పుర: బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 31న రవీంద్రభారతిలో నిర్వహించే బీసీల యుద్ధభేరి మహసభ వాల్ పోస్టర్‌ను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం వేర్వేరుగా ఆవిష్కరించినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ తెలిపారు. ఈమేరకు వారిని ఈ మహాసభకు ఆహ్వానించినట్లు తెలిపారు.

అరెస్ట్ వారెంట్ పేరిట వృద్ధుడికి బెదిరింపు

● రూ.33.40 లక్షలు వసూలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మీకు మానవ అక్రమరవాణా గ్యాంగుతో సంబంధాలున్నాయని, అరెస్ట్ వారెంట్ వచ్చిందని ఓ వృద్ధుడిని భయపెట్టిన సైబర్ నేరగాళ్లు అతని నుంచి రూ.33.40 లక్షలు వసూలు చేశారు. వివరాలిలా ఉన్నాయి. బోయినపల్లికి చెందిన వృద్ధుడి(73)కి జూలై 25న ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేసి తనను తాను కర్నాటక క్రైం బ్రాంచ్ అధికారి గౌరవ్ సారథిగా పరిచయం చేసుకున్నాడు. మానవ అక్రమరవాణా కేసులో మీ ఆధార్ కార్డు ఆధారంగా బ్యాంకు ఖాతాల వినియోగం జరిగిందని, మీపై అరెస్ట్ వారెంట్ జారీ అయిందని భయపెట్టాడు. అందుకు సంబంధించి నకిలీ పత్రాలు చూపి, విచారణ పూర్తయ్యే వరకు ఎవరితో మాట్లాడవద్దని ఆదేశించాడు. తర్వాత వీడియో కాల్‌లో మాట్లాడిన సైబర్ నేరగాడు దయానాయక్‌గా పరిచయం చేసుకుని ఫండ్ వెరిఫికేషన్ అంటూ రూ.15 లక్షలు ఆర్‌బీఐ ఖాతాలకు బదిలీ చేయాలని సూచించాడు. తర్వాత పలు కారణాలు చూపుతూ పలుమార్లు డబ్బు బదిలీ చేయించుకున్నాడు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత డబ్బు మీ ఖాతాలో జమ చేస్తామని చెబుతూ ఆగస్టు 8 వరకు పలు దఫాలుగా రూ.33.40 లక్షలు వసూలు చేశాడు. డబ్బు ఎప్పుడు రీఫండ్ చేస్తారని ప్రశ్నించగా, అతను స్పందించడం మానేశారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన

● 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

● సెప్టెంబర్-2న ఫైనల్ పబ్లికేషన్

● మండలంలోని 14 గ్రామాల్లో 35,585 ఓట్లు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఓటరు జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల వివరాలు, తుది ఓటరు జాబితా వెల్లడికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో భాగంగా గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో జాబితాతో పాటు పోలింగ్ స్టేషన్ల వివరాలను పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 30వ తేదీన జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీవాణి తెలిపారు. సెప్టెంబర్ 2న ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల ఫైనల్ పబ్లికేషన్ విడుదల చేయనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 35,585 ఓట్లు ఉన్నాయి.

ఎస్‌సీఆర్‌లో మెడికల్ సర్టిఫికెట్ జారీ స్కాం

● సికింద్రాబాద్ డాక్టర్‌కు రూ.లక్ష లంచం ఎర

● ముగ్గురిపై సీబీఐ కేసు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) పరిధిలో మెడికల్ సర్టిఫికెట్ల స్కామ్ వెలుగు చూసింది. ఈ విషయమై ముగ్గురు వ్యక్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసింది. విజయవాడ సీనియర్ ప్యాసింజర్ మేనేజర్ ఒంటిపూడి శివనాగప్రసాద్‌కు జారీ చేయాల్సిన మెడికల్ సర్టిఫికెట్‌ను సికింద్రాబాద్ - లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణ పెండింగ్‌లో పెట్టారు. ఈ సంగతి తెలుసుకున్న విజయవాడ రైల్వే ఆస్పత్రి ఆఫీసు సూపరింటెండెంట్ హస్మత్ అలీ బావమరిది షేక్ రసూల్ రంగంలో దిగాడు. నాగప్రసాద్‌కు మెడికల్ సర్టిఫికెట్ క్లియర్ చేయిస్తే రూ.లక్ష వస్తాయని రసూల్ తన బావకు చెప్పడంతో, తాను డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణతో మాట్లాడుతానని, ఆ డబ్బు తేవాలని అతను సూచించాడు. దాంతో నాగప్రసాద్ నుంచి రసూల్ ఆ మొత్తాన్ని సేకరించాడు. ఈ విషయం తెలిసిన డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణ సమాచారాన్ని సీబీఐకి చేరవేశాడు. ఈ నెల 26న హస్మత్ అలీ, రసూల్, నాగప్రసాద్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించామని సీబీఐ అధికారులు తెలిపారు.


నిమజ్జన కొలనుల వద్ద ఏర్పాట్లు


నాగోల్‌చెరువు బేబీపాండ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రనాథ్‌యాదవ్, ఏసీపీ కృష్ణయ్య

మన్సూరాబాద్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా కొంత అంతరాయం ఏర్పడినప్పటికీ మన్సూరాబాద్ పెద్ద చెరువు, నాగోల్ చెరువుల వద్ద గల బేబీపాండ్ల వద్ద జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దచెరువు వద్ద చేపడుతున్న ఏర్పాట్లను ఎల్బీనగర్ డీసీపీ చల్లా ప్రవీణ్‌కుమార్, వనస్థలిపురం ఏసీపీ పి.కాశిరెడ్డిలు స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ టి.మహేష్‌లతో కలిసి పరిశీలించి అక్కడి ఏర్పాట్లను గురించి జీహెచ్‌ఎంసీ ఏఈ స్వప్నను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నాగోల్ చెరువు వద్ద ఏర్పాట్లను ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణలు వేర్వేరుగా స్థానిక నాయకుడు ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహేష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు

మూసీలో వ్యక్తి గల్లంతు


మూసీలో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న హైడ్రా సిబ్బంది

చాదర్‌ఘాట్ : మద్యం మత్తులో మూసీలో ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతైన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ కె.బ్రహ్మమురారీ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్ నివాసి మహ్మద్ సలీం(32) వృత్తి రీత్యా రోజు కూలీ. మద్యం మత్తులో శంకర్‌నగర్‌లోని హనుమాన్ ఆలయం సమీపం నుంచి మూసీలో ఈత కోసం గురువారం దూకాడు. మూసీలో వరద ప్రవాహం కొనసాగుతుండడంతో సలీం కొద్ది సేపటికే కనిపించకుండా పోవడంతో స్థానికులు గమనించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు హైడ్రా, జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపారు. మూసీ లో గల్లంతైన సలీం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

వనస్థలిపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యం దృష్ట్యా వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. దీంతో అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్న క్రమంలో బుధవారం రాత్రి చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.